క్లుప్తంగా

క్లాప్ మిత్రలతో గ్రామాలు పరిశుభ్రం



నడకుదురులో క్లాప్‌మిత్రలతో కలసి కాఫీ తాగుతున్న అధికారులు, నాయకులు

కరప: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయంటే అందుకు క్లాప్ మిత్రల సేవలేనని ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన నడకుదురు, పెనుగుదురు, కూరాడ తదితర గ్రామాల్లో పర్యటించి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలసి వారి సత్కరించి, వారితో అల్పాహారం, కాఫీ తీసుకున్నారు. సర్పంచ్‌లు డేగల లలితకుమారి, వాసంశెట్టి కొండ, పీఏసీఎస్ చైర్మన్ రావులు ప్రసాద్, గ్రామ కార్యదర్శులు పీఎస్ఆర్ బ్రహ్మనందం, బి.చంద్రకళ, ముమ్మిడి చక్రపాణి, కె.రవి, పైలా గోవిందు, పోతల లోవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లుగా సొసైటీ బలోపేతం

కాకినాడ సిటీ: ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ సినిమా రోడ్డులోని కేఆర్‌వీకే రావు ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వందేళ్లుగా సొసైటీ ఎంతో బలోపేతంగా ఉందన్నారు. సంఘం ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం 2022-23 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్టును మహాజన సభ ఆమోదం కోసం ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆడిటర్ డీపీఆర్ స్వామి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఆర్‌వీ రాజేంద్రకుమార్, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మిప్రసాద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎలీషాబాబుకు అభినందనలు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శిగా నియమితులైన అక్నూ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎలీషాబాబుకు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు శుక్రవారం అభినందనలు తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, తైక్వాండో సంఘ కార్యదర్శి అర్జునరావు, మాస్టర్ అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఒలింపిక్ సంఘ కోశాధికారి కొండలరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, నన్నయ వర్సిటీ పీడీ రామ్‌గోపాల్ తదితరులు ఎలీషాబాబును అభినందించారు. జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడిగా 2014 నుంచి సేవలు అందిస్తున్నారు. ఒలింపిక్ సంఘంలో 20 ఏళ్ల నుంచి ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కాకినాడ సిటీ: రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కాకినాడ ఆధ్వర్యంలో రూ.80 వేల విలువైన క్రీడా సామగ్రిని శిక్షణ నిమిత్తం అందజేశారు. ప్రతి రోజు తూరంగి పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.సతీష్‌కుమార్ సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కడలి విజయ దుర్గ, పాఠశాల పీఈటీలు వి.మాచరరావు, వి.రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు శిక్షణను ప్రారంభించారు.

ఉద్యమాలపై నిర్బంధం తగదు

కాకినాడ సిటీ: ప్రజా ఉద్యమాలపై పోలీసుల వైఖరి మార్చుకోవాలని, రాజ్యాంగం ప్రకారం పని చేయాలని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలియజేసే హక్కుని కాపాడాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శుక్రవారం టీచర్స్ హోంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్మిక సంఘాల నాయకులు దువ్వా శేషుబాబీజ తోకల ప్రసాద్, జల్లూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి రాజు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

కరప: మండలం గొర్రిపూడిలో మంగళవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు భూమిపూజ చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రిపూడి నుంచి తాళ్లరేవు మండలం జి.వేమవరం వెళ్లే రోడ్డు ధ్వంసమై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించి మండల పరిధిలో గొర్రిపూడి నుంచి జి.వేమవరం వరకు బీటీ రోడ్డు వేసేందుకు, గ్రామంలో సీసీ రోడ్డు, ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మించేందుకు రూ.1.64 లక్షలు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కానూరి హరిబాబు, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, శ్రీపాదం వెంకటరమణ, కేతా శ్రీనివాస్, గండి భాగ్యశేఖర్, దేపాటి అచ్చిబాబు పాల్గొన్నారు.

మంచి జీవనశైలితో గుండె ఆరోగ్యం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కే వాకథాన్



సూర్య గ్లోబల్ ఆస్పత్రి వద్ద ఆసనాలు వేస్తున్న యోగా గురువు సూర్యానారాయణరావు



ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కే వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మంచి జీవన శైలితోనే గుండె ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కాకినాడలోని వివిధ రోటరీ క్లబ్‌లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం సర్పవరం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వాకథాన్ 2కెను ఆయన ప్రారంభించారు. ర్యాలీలో భాగంగా ఆయన బీపీ, షుగర్, సీపీఆర్‌పై అవగాహన శిబిరం సందర్శించారు. అనంతరం ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఏటా సెప్టెంబరు 29న గుండె వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మితమైన ఆహారం, వ్యాయామం, సమయానికి నిద్రపోవడం, ఒత్తిడి లేని జీవితం అలవర్చుకోవడంతో పాటు తరచూ వైద్య పరీక్షలను చేయించుకోవడంతో గుండె జబ్బుల నుంచి బయట పడవచ్చన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వైడీ రామారావు, ట్రస్ట్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎస్‌సీహెచ్ రామకృష్ణ, కార్డియాలజిస్టులు నిశాంత్, పవన్, చంద్రమౌళి, రామకృష్ణ, అడ్డాల సత్యనారాయణ, ఆదిత్య రవికృష్ణ, ఉదయ భాను తదితరులు పాల్గొన్నారు.

సూర్య గ్లోబల్, టీమ్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో

సూర్య గ్లోబల్, టీమ్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సూర్య గ్లోబల్ ఆస్పత్రి వద్ద ఎండీ డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ గుండెను పదిలంగా కాపాడుకోగలితే మన ఆయుస్సు పెరుగుతుందన్నారు. గుండె వైద్య నిపుణులు పాండా, ఆదినారాయణ, శ్రీనివాస్ పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. యోగా గురువు సూర్యనారాయణరావు గుండె సంబంధిత వ్యాయామాలు చేసి చూపారు.

సామాన్యులకు ఉచిత గుండె వైద్యం

బోట్‌క్లబ్: సామాన్యులకు సైతం అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఇనోదయ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మోహనరావు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత గుండె పరీక్షలు, ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహించారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల గుండె సంబంధ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. హాస్పిటల్ సీఈఓ లావణ్య మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఇనోదయ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ వంటి హృద్రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు మదన్, గౌతమ్‌కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇనోదయ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సమీక్ష

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలుపై రహస్య డెకాయ్ ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈ చట్టం అమలు పర్యవేక్షణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ కొత్తగా ఏర్పాటైన 4 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లకు, చిరునామా, పరికరాలు, సిబ్బంది మార్పులు కొరకు దరఖాస్తులు చేస్తున్న 6 సెంటర్లకు కమిటీ అనుమతులు జారీ చేసింది. కమిటీ సభ్యులు 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, అడిషనల్ ఎస్పీ పి శ్రీనివాస్, డీఎంఅండ్‌హెచ్‌వో జె.నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన

కాకినాడ రూరల్: ఇందన పొదుపుపై విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఐఎంఏ భవనంలో ఏపీ ఈపీ డీసీఎల్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై కాలనీ వాసులు, అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, విద్యార్థులు, ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్లకు చెందిన వారికి పర్యావరణ పరిరక్షణకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఈఈ జి.ప్రసాద్, డీఈఈలు శ్రీనివాస్, గంగాధర్, విష్ణుమూర్తి, ఏఈఈ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

- హాజరుకానున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన తహసీల్దార్, ఎంపీడీఓ



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. వైద్యశిబిరం నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఇతర నాయకులతో కలసి అధికారులు పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గ్రామాల్లో తనతో పాటు, ఎంపీడీఓ అప్పారావుతో కలసి రెండు బృందాలు వైద్య సిబ్బందితో ఇంటింట సర్వే నిర్వహించి, బీపీ, షుగర్ తదితర పరీక్షలుచేసి, ప్రజల నుంచి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నట్టు తెలిపారు. మండలంలో అక్టోబరు 25వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కరపలో శనివారం నిర్వహించే వైద్య శిబిరాన్ని కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. సర్వే నివేదిక ప్రకారం ఆరోగ్య సమస్యలున్న వారిని శిబిరానికి తీసుకొచ్చి, వైద్య పరీక్షలు చేయించి, మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారిని కాకినాడ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించనున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు వివరించారు. ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ వివిధ గ్రామాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలకు ఏర్పాట్లు చేయండి

కరప: మండల పరిధిలో శనివారం నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయం కార్యదర్శులు, కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు, తదితర శాఖాధికారులతో సమావేశమై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యాలయాల్లో కానీ, పాఠశాలల్లో కానీ ఎక్కడ అనువుగా ఉంటే అక్కడ వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీరు వంటి వసతులు కల్పించాలన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో పాల సేకరణకు కావాల్సిన భవనాలు సమకూర్చి, విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

ఓర్పుతో సత్ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కరప: ఏ పని చేసినా తొందర పడకుండా ఓర్పు వహిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని యెహోవా సాక్షుల సమావేశ చైర్మన్ ఎస్.సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలం నడకుదురులోని కుసుమ సత్య కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన మొదటిరోజు సమావేశంలో ఓర్పు చూపించండి అనే అంశంపై ఆయన మాట్లాడారు. కొన్ని సలహాలను వీడియో ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. కన్వెన్షన్ కమిటీ సభ్యుడు పి.కుమార్ రాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీవైఎఫ్ అంతర్జాతీయ యువజనోత్సవాలు

కాకినాడ రూరల్: క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ (సీవైఎఫ్) 26 వసంతాల అంతర్జాతీయ యువజన మహోత్సవాలు ఆదివారం అచ్చంపేట జంక్షన్ సమీపంలో లక్ష్మీ పరిణయ ఫంక్షన్ హాలులో ప్రారంభమవుతాయని సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, ఫౌండర్ డాక్టరు బీహెచ్‌వీ మూర్తిరాజు తెలియజేశారు. ఆదివారం ఉదయం సమాఖ్య ఆరాధనతో ప్రారంభమవుతాయని, రాత్రికి సువార్త గాయకులతో నాన్ స్టాపబుల్ సంగీత ప్రవంతి ఏక్ హమ్ కార్యక్రమం, సోమవారం లండన్ బ్రిటిష్ పార్లమెంట్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు స్వీకరించిన అభినందన సభ, రాత్రికి వార్షికోత్సవం ఉంటాయన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా జాబ్‌మేళా, రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదిత్య పీజీ కళాశాలలో శుక్రవారం రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ నాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని, రక్తదానం ద్వారా మరొకరికి జీవితం ఇచ్చినవాళ్లమవుతామన్నారు. శిబిరంలో భాగంగా 120 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కామరాజు, ప్రిన్సిపాల్ బ్యులా పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణలో అప్రమత్తం

కరప: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతోపాటు, రికార్డులు సక్రమంగా ఉంచాలని ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తిచేసి, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. నాడు-నేడు పనులపై చర్చించి, సకాలంలో పూర్తిచేయించాలన్నారు. ఏ అధికారి పాఠశాలకు వచ్చినా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంఈఓ-2 పి.సత్యనారాయణ, హైస్కూలు హెచ్‌ఎంలు వి.శ్యామలాసుజాత, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, శ్రీనివాస్, సీఆర్పీలు పి.రాజు, పి.సునీత, బి.సారాకుమారి, పి.సత్యనారాయణ, ఎం.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తూరంగిలో నా భూమి-నాదేశం

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి-నాదేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు అమృత కలశ యాత్ర నిర్వహించారు. విద్యార్థులతో వివిధ రకాల అందమైన కలశాలను తయారు చేయించి ఆ కలశాలతో స్థానిక మట్టిని ఉపాధ్యాయులతోను, విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో సేకరించి ఆ కలశాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కడలి విజయదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కన్నబాబు సత్కారం



కలెక్టర్ కృతికా శుక్లాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ సిటీ: ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డు కాంటెస్ట్ (ఐఎస్‌ఏసీ)-2022 పురస్కారం అందుకుని నగరానికి వచ్చిన కలెక్టర్ కృతికా శుక్లాను రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం కలెక్టరేట్‌లో సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన కలెక్టర్‌ను అభినందించారు.

కలెక్టర్‌ను కలసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆమెకు సూచించారు.

క్రీడా పరికరాల కిట్ల పరిశీలన

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర గవర్నమెంట్‌కు సంబంధించిన నమూనా కిట్లను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ హెడ్ క్వార్టర్‌లో ఈ టోర్నీ కిట్ల పంపిణీకి సంబంధించి సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పంపిణీ చేసే కిట్లు, నియోజకవర్గ స్థాయి నుంచి, జిల్లా స్థాయి వరకు పంపిణీ చేసే కిట్లను జిల్లా కేంద్రాలకు పంపినట్లు కలెక్టర్ వివరించారు.

జెడ్.భావారం సొసైటీకి రూ.9.43 లక్షల లాభం



సంఘ కార్యకలాపాలు వివరిస్తున్న సీఈఓ వెంకటేశ్వరరావు

కరప: మండలం జెడ్.భావారం పీఏసీఎస్‌లో సభ్యత్వమున్న రైతులందరికీ రుణ పరపతి కల్పించి, సొసైటీని లాభాల బాటలో నడిపిస్తున్నట్టు ఆ సంఘం సీఈఓ రాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. జెడ్.భావారం పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. సంఘ పరిధిలో జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాలకు చెందిన 1,552 మంది రైతులు సభ్యులుగా ఉండగా, 1,450 మందికి స్వల్ప, దీర్ఘకాలిక, తదితర రుణాలుగా రూ 8,06,16,280 ఇవ్వడం జరిగిందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఏసీఎస్‌కు రూ.9.43 లక్షలు లాభాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు 30 వరకు జరిగిన జమా ఖర్చులు, సంఘ కార్యకలాపాలను, ఇతర అజెండా విషయాలను ఆయన సభ్యులకు వివరించి, ఆమోదింపచేశారు. పీఏసీఎస్ ప్రత్యేకాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.శివకామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో రోటరీ ముందంజ



తిలక్‌వీధిలోని మున్సిపల్ పాఠశాలకు ఫ్యాన్, కుర్చీలు అందిస్తున్న సుబ్బారావు

బోట్‌క్లబ్: స్థానిక రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు శుక్రవారం సందర్శించారు. ప్రజా సేవల్లో తమ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. రోటరీ డిస్ట్రిక్‌లో 86 క్లబ్‌లు ఉన్నాయిని వీటిలో 5వేల మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది రోటరీ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన క్లబ్‌ల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా తిలక్‌వీధిలోని కంపర వీణారావు నగరపాలక సంస్థ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్, కుర్చీలు అందించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ, సెక్రటరీ చందు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు కలెక్టర్ అభినందన



కలెక్టర్ కృతికా శుక్లాకు చిత్రాలను చూపిస్తున్న ఫొటోగ్రాఫర్

కాకినాడ సిటీ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక ఫొటోగ్రాఫర్ తీసిన చిత్రం గోదావరి మంచి పర్యాటక ప్రదేశం అనే ఫొటో, అన్నవరం దేవస్థానం తెప్పోత్సవంపై తీసిన చిత్రాలు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాను ఫొటోగ్రాఫర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ప్రోత్సాహంతో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్‌లో గల పర్యాటక ప్రాంతాలు అనే అంశంపై విజయవాడలో ఫొటో ప్రదర్శన నిర్వహించాయి. ప్రతిభా పురస్కారం , స్వర్ణ పతకం, ప్రశంసాపత్రాన్ని చూపించారు. కాకినాడకు చెందిన ఫొటోగ్రాఫర్లు అరుణ్‌కుమార్, వి.వెంకటేష్, కె.నరేష్‌లను కలెక్టర్ అభినందించారు.

రేపు 'ఏక్ తారీఖ్- ఏక్ ఘంటే'

- కమిషనర్ నాగ నరసింహారావు
- పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ ఒకటో తేదీన పరిశుభ్రతపై ప్రజల భాగస్వామ్యంతో ఏక్ తారీఖ్ - ఏక్ ఘంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఈ అంశంపై శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాధిపతులు, ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవలో భాగంగా అక్టోబర్ రెండో తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక ఇచ్చిందన్నారు. ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు చెరువులు, నీటి కుంటలు జన సాంద్రత అధికంగా ఉండే బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఇతర ముఖ్య ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున పరిశుభ్ర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నగర పరిధిలో బోట్‌క్లబ్, అన్నమ ట్యాంకు ప్రాంతాలను ఎంపిక చేస్తామని, అక్కడ ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇతర వర్గాలను భాగస్వామ్యం చేస్తామన్నారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

రెండో తేదీన స్వచ్ఛత దిశగా అడుగులు వేసి ఉత్తమ సేవలు అందించిన వివిధ వర్గాలను ఎంపిక చేసి సన్మానించి, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఈఈ మాధవి, మేనేజర్ కె.సత్యనారాయణ, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, పలువురు ప్రత్యేక అధికారులు, పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యాన్ దగ్ధం



వ్యాన్‌కు అంటుకున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వాస్పత్రి బస్టాండ్ ఆవరణలో వార్త పత్రికలు బట్వాడా చేసే ఒక వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయ్యింది. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన కె.రామకృష్ణకు మారుతీ ఎకో వ్యాన్ ఉంది. ఈ వాహనంపై వార్తాపత్రికలు వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రాజానగరం నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్లిన రామకృష్ణ తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రానికి వెళ్లేందుకు కాకినాడ మీదుగా పయనమయ్యారు. వ్యాన్ జీజీహెచ్ బస్టాండ్ వద్దకు వచ్చే సరికి షార్ట్‌సర్క్యూట్‌తో మంటల్లో చిక్కుకుంది. యజమాని రామకృష్ణతో సహా సహాయకుడు వాహనాన్ని అక్కడే వదిలేసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. స్థానికులు సాలిపేట అగ్ని మాపకశాఖకు సమాచారం ఇవ్వగా, సాలిపేట అగ్నిమాపక బృందం అక్కడకు చేరుకుని ఫైర్‌మెన్ రాంబాబు ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల ఆస్తినష్టం జరగ్గా, రూ.2.5 లక్షల ఆస్తిని సంరక్షించినట్టు ఏడీఎఫ్‌వో తెలిపారు.

సెక్యూరిటీ గార్డు మృతి

కాకినాడ రూరల్: కాకినాడ పోర్టు ఏరియాలో బోత్రా కంపెనీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పెనుబోతు సత్యనారాయణ అలియాస్ సత్యానందం (51) మృతి చెందడంతో సర్పవరం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తూరంగి లక్ష్మీనగర్‌కు చెందిన ఆయన కంపెనీ షెడ్ వద్ద గురువారం విధుల్లో ఉండగా మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు పరిహారం కోసం ఆందోళన చేపట్టారు. యాజమాన్యం ఆదుకునేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. మృతుని భార్య రత్నం ఫిర్యాదు మేరకు ఏఎస్సై వీర భద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి



పాముకాటుకు గురైన బాలిక మానసాదేవి

కరప: పాముకాటుకు గురైన బాలిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కరప పోలీసుస్టేషన్ రైటర్ పి.శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు వాకాడ గ్రామానికి చెందిన బొంతు లోవరాజు కుమార్తె మానసా దేవి (12) ఈ నెల 28న ఇంటిలో పుస్తకాలు సద్దుకుంటుండగా, ఆమె ఎడమచేతి మణికట్టుపై గుర్తుతెలియని పాము కాటువేసింది. వెంటనే మానసదేవిని చికిత్స కోసం తండ్రి లోవరాజు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.